# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 27-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **అమృతకాలపు వికసిత భారత్ లక్ష్యానికి 18వ లోక్ సభ కొనసాగింపుగా ఉంటుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ్ పేర్కొన్నారు.**

**2** **ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెంచిన పింఛన్లను జులై 1వ తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దనే అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.**

**3** **జులై నెలలో నిర్వహించనున్న రొట్టెల పండుగకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు.**

**4** **తిరుపతిలో అఖిల భారత చిరుధాన్యాల పరిశోధనపై రెండు రోజుల జాతీయ సదస్సు ఈరోజు ప్రారంభమైంది.**

**5.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది.**

==========================

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు కొనసాగుతున్నాయి. సమావేశాల్లో భాగంగా ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ్ ఈ రోజు ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యులను అభినందించారు. మూడోసారి అధికారం చేపట్టిన ఎన్డీయే ప్రభుత్వ ప్రాధామ్యాలను రాష్ట్రపతి వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధిని సాధించిందని తెలిపారు. అమృతకాలపు వికసిత భారత్ లక్ష్యానికి 18 వ లోక్ సభ కొనసాగింపుగా ఉంటుందని పేర్కొంటూ,

వాయిస్ (32 సెకన్లు)

---------------------------

ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెంచిన పింఛన్లను జులై 1వ తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దనే అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పింఛన్ల పంపిణీకి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలని, అవసరమైన చోట ఇతర శాఖలకు చెందిన ఉద్యోగులనూ పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకుగాను వెయ్యి చొప్పున కలిపి జులైలో 7 వేలు ప్రభుత్వం అందించనుంది. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించి వీలైనంతవరకు మొదటి రోజే

అందరికీ నగదు అందించాలని స్పష్టం చేశారు. మిగిలిన వారికి రెండో రోజు అందించాలని తెలిపారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

---------------------------

జులై నెలలో నెల్లూరులోని బారా షహీద్ దర్గాలో నిర్వహించనున్న రొట్టెల పండుగ నిర్వహణకు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు. నిన్న నెల్లూరులో రొట్టెల పండుగ ఏర్పాట్లపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రొట్టెల పండుగకు రాష్ట్రంతో పాటు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఇందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రొట్టెల పండుగను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని సూచించారు.

---------------------------

తిరుపతిలో అఖిల భారత చిరుధాన్యాల పరిశోధనపై రెండు రోజుల జాతీయ సదస్సు ఈరోజు ప్రారంభమైంది. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సును జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్.తారా సత్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిరు ధాన్యాలను పండించే వివిధ రాష్ట్రాలలో జరిగిన పరిశోధన ప్రగతి గురించి ఈ సదస్సులో చర్చించి, జాతీయ స్థాయి పరిశోధన కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. చిరు ధాన్యాల పంటల సాగుకు అందుబాటులో ఉన్న రకాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, తదితర అంశాలపై చర్చించి రైతులకు మెరుగైన పద్ధతులపై అవగాహన కల్పిస్తామని వివరించారు.

---------------------------

దేశవ్యాప్తంగా జూలై 1వ తేదీ నుండి అమలులోకి రానున్న నూతన నేర చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ధర్మవరం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసులు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ, నూతన నేర చట్టాల అవగాహన సదస్సులో 6గురు శిక్షకులతో అధికారులకు నూతన చట్టాల విధివిధానాలను తెలియజేశామని చెప్పారు. సాంకేతిక సాక్షాధారాల సేకరణ, భద్రపరిచే విధానం, సాంకేతిక వినియోగం గురించి అవగాహన కార్యక్రమంలో వివరించడం జరిగిందని తెలిపారు.

---------------------------

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 90% వ్యాపారాలు, 70% ఉపాధి అవకాశాలకు ఈ పరిశ్రమలు దోహదపడుతున్నాయని ఐక్యరాజ్యసమితి తెలిపింది. దేశంలోని ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఈ రోజు ఉద్యమ భారత్ – ఎంఎస్ఎంఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ముఖ్యంగా భారతదేశంలో ఈ సంస్థలు యువత, మహిళలు, పేదలకు జీవనోపాధిని కల్పించడంతో పాటు ఆర్థిక చేయూతను అందించేందుకు దోహదపడుతున్నాయి.

దేశవ్యాప్తంగా ఇటువంటి పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులను సులభతరం చేయడానికి ఉద్యమి రిజిస్ట్రేషన్

పోర్టల్‌ని 2020 జూలై 1అన కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటివరకు ఈ పోర్టల్‌లో 4.63 కోట్లకు పైగా ప్రరిశ్రమలు నమోదైయ్యాయని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ తెలిపింది.

---------------------------

విశాఖ ఉక్కు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖమంత్రి కుమారస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నిన్న ఢిల్లీలో విశాఖ ఉక్కు పరిశ్రమ అంశంపై రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి నేతృత్వంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌లు కుమారస్వామితో సమావేశమై చర్చించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని లాభాల బాటలో నడిపించే అంశాలపై చర్చించి. అందుకు సంబంధించిన ప్రణాళికను కేంద్ర మంత్రికి వివరించారు. ఉక్కు కర్మాగారం అంశాలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని పురందేశ్వరి తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను రేపటిలోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గౌవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు, శాకంబరీదేవి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణధికారి కె.ఎస్.రామారావు పేర్కొన్నారు. నిన్న విజయవాడలో ఆషాఢం, శాకంబరీదేవి ఉత్సవ ఏర్పాట్లపై దేవస్థానానికి చెందిన అధికారులతో ఈఓ సమీక్షా సమావేశం నిర్వహించి ఆయా విభాగాల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కె.ఎస్.రామరావు మాట్లాడుతూ జూలై 19 నుంచి 21వ తేదీ వరకు శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. జులై 6 నుంచి ఆగస్టు 5 వతేదీ వరకు ఆషాఢమాసం సందర్భంగా భక్తులు కనకదుర్గమ్మవారికి పవిత్ర సారె సమర్పించనున్నందున అందుకు దేవస్థానం తగు ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. జులై 14వ తేదీన హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పించనున్నారని తెలిపారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు ఈవీఎం ధ్వంసంతోపాటు, ఎన్నికల అల్లర్ల కేసులో అరెస్టు అయిన మాచర్ల మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి ముందు ఆయనను పోలీసులు గత రాత్రి ప్రవేశపెట్టగా ఈవీఎం ధ్వంసం సహా నాలుగు కేసుల్లో విచారణ చేపట్టి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

---------------------------

వ్యవసాయ ఉద్యాన పంటల సాగుకు శాస్త్రవేత్తలు 28 రకాల వంగడాలను రైతులకు అందుబాటులోకి

తెచ్చారని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి. జానకి రామ్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలో ఉద్యాన విశ్వవిద్యాలయం 17వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలను, ఉద్యోగులను, విద్యార్థులను ఉపకులపతి సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. అనంతరం ఉపకులపతి మాట్లాడుతూ ఉద్యాన విశ్వవిద్యాలయం ఎ గ్రేడ్ అక్రిడేషన్ సాధించిందన్నారు. భారతదేశానికి వ్యవసాయం జీవనాడి వంటిందని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి సాగు ఖర్చులు తగ్గించి, ఉత్పాదకత పెంపుపై శాస్త్రవేత్తలు దృష్టి నిలపాలని అన్నారు.

--------------------------

ప్రకాశం జిల్లా నూతన కలెక్టర్‌గా తమిమ్ అన్సారియా ఈరోజు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను నిర్దేశిత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

మరోవైపు.. గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మి కలెక్టరేట్ కార్యాలయంలో నిన్న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె.. మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తానని తెలిపారు. గతంలో పని చేసిన జిల్లాకు రావడం, అమరావతి రాజధాని ప్రాంతంలో పని చేయడం సంతోషంగా ఉందని కలెక్టర్  తెలిపారు.

======================